క్లుప్తంగా

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోండి



మాచరలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ, కార్యదర్శి

కపిలేశ్వరపురం: మాచర గ్రామంలోని జగనన్న కాలనీలో స్థలం మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోమంటూ అధికారులు చైతన్య పరిచారు. పంచాయతీ కార్యదర్శి చిన బాబు, హౌసింగ్ ఏఈ పీవీఎస్ఎన్మూర్తి ఆధ్వర్యంలోని సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వ సాయాన్ని వివరించారు. ప్రభుత్వ సాయానికి తోడు సంబంధిత సామగ్రిని సమకూర్చుకుని సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలంటూ అవగాహన కల్పించారు. వారి వెంట వలంటీర్లు, గ్రామాభివృద్ధి ఔత్సాహికులు ఉన్నారు.

'సిరిపురపు'ను సత్కరించిన నాగిరెడ్డి



శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎంవీఎస్ నాగిరెడ్డి

రాయవరం: మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సిరిపురపు శ్రీనివాసరావును రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి శుక్రవారం సత్కరించారు. మండలంలోని నదురుబాదలో శ్రీనివాసరావు స్వగృహానికి శుక్రవారం నాగిరెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తులకు పార్టీ పెద్ద పీట వేస్తుందన్నారు. పార్టీని నమ్ముకున్న వ్యక్తులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు న్యాయం చేస్తారనడానికి శ్రీనివాసరావు నియామకమే ఒక ఉదాహరణగా ఆయన తెలిపారు. నాగిరెడ్డి వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ కొవ్వూరి త్రినాథరెడ్డి, వ్యవసాయ మిషన్ డైరెక్టరు జిన్నూరి బాబీ, హార్టికల్చర్ డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

డీఎస్పీని కలసిన దొమ్మలపాటి



డీఎస్పీ ప్రసాద్‌ను కలసిన హితకారిణి సమాజం డైరెక్టర్ దొమ్మలపాటి సత్యనారాయణ

రామచంద్రపురం: డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను రాష్ట్ర హితకారిణి సమాజం డైరెక్టర్, సీనియర్ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ ప్రసాద్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం వద్ద దాహార్తి తీర్చుకుంటున్న ప్రయాణికులు

కె.గంగవరం: మండలంలోని సుందరపల్లి ఏటిగట్టుపై గల అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద గ్రామస్తులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏటిగట్టుపై ఎండతీవ్రత ఎక్కువగా ఉండడం, వడగాడ్పులు వీయడం, ఏటిగట్టుపై యానం నుంచి జొన్నాడ వరకు అధిక సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుండడం గమనించిన గ్రామస్తులు ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి ఉన్నంత వరకు చలివేంద్రం వద్ద ప్రతి రోజు దాతల సహాయంతో చల్లని మజ్జిగ, మంచి నీరు అందుబాటులో ఉంటాయని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా షేక్ మౌషి



షేక్ బాజ్జీతో షేక్ మౌషి

రాయవరం: నూర్ భాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా షేక్ మౌషి నియమితులయ్యారు. ఈ విషయాన్ని మౌషి శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. మండలంలోని కురకాళ్లపల్లి గ్రామంలో పశువైద్య సిబ్బందిగా పనిచేస్తున్న మౌషి నూర్ భాషను ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజ్జీ నియమించినట్లు తెలిపారు. విజయవాడలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నియామకం జరిగిందన్నారు.

గౌరవం... ప్రోత్సాహం... పురస్కారం..

- వలంటీర్లకు సేవా పురస్కారాలు
- ఉత్సాహం నింపుతున్న ప్రభుత్వ కార్యాచరణ
- రెండు నియోజకవర్గాల్లో 2,637 మంది వలంటీర్లు
- 2,571 మందికి సత్కారం



2021 ఏప్రిల్‌లో రామచంద్రపురంలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రముఖులు (ఫైల్)

కపిలేశ్వరపురం: దేశంలో ఎక్కడా లేని బలోపేతమైన వలంటీర్ వ్యవస్థ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పారు. దానిని సచివాలయ వ్యవస్థకు అనుసంధానం చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా, సకాలంలో పేద, మధ్య తరగతి ప్రజలకు చేరువ చేస్తున్నారు. నెలనెలా గౌరవ వేతనం చెల్లిస్తూ, వారిని సేవ వైపు ప్రోత్సహిస్తూ , పురస్కారాలతో సత్కరిస్తూ ప్రజల ముందు వలంటీర్లకు అమితమైన గౌరవాన్ని కల్పించారు.తమ బాగోగులు చూసే బిడ్డలకు ప్రభుత్వం పురస్కారాలు అందిస్తోందంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నగదు పురస్కారాలిలా..

2019 ఆగస్టు 15న ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. అత్యుత్తమ సేవలందించిన వలంటీర్లకు ఏటా సేవా వజ్ర ద్వారా రూ.30 వేలు, సేవారత్న ద్వారా రూ.20 వేలు, సేవామిత్ర ద్వారా రూ.10వేల నగదు పురస్కారం, ప్రశంసా పత్రం, మెడల్, బ్యాడ్జి అందజేసి శాలువా కప్పి గౌరవిస్తుంది.

సేవా వజ్ర పురస్కార గ్రహీతలు వీరే...

నియోజకవర్గానికి ఐదుగురు చొప్పున రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 10 మంది వలంటీర్లకు సేవా వజ్ర పురస్కారాలు వరించాయి. మండపేట రూరల్ మండలం తాపేశ్వరానికి చెందిన బూరా వెంకటేష్, తాతపూడి శాంతకుమారి, రాయవరానికి చెందిన బూలా రాజబాబు, మల్లిరెడ్డి సత్య అనురాధ, కపిలేశ్వరపురం మండలం నేలటూరుకు చెందిన వాసంశెట్టి మంగాలక్ష్మి, రామచంద్రపురం మండలం హసనబాదకు చెందిన తీపర్తి వెంకటేశ్వరరావు, కె.గంగవరం మండలం దంగేరుకు చెందిన నీలా శ్రావణి, అద్దంపల్లికి చెందిన చల్లా సత్యవేణి, కాజులూరు మండలం టి.మామిడాడకు చెందిన కోట జ్యోతి, ఉప్పుమిల్లికి చెందిన పందిరి రవిశంకర్‌లు సేవా వజ్ర పురస్కారానికి ఎంపికయ్యారు.

సేవారత్న పురస్కార గ్రహీతలు వీరే...

మండలానికి, మున్సిపాలిటీకి సుమారుగా ఐదుగురు చొప్పున సేవారత్న పురస్కారానికి ఎంపిక చేశారు. మండపేట పట్టణంలోని వల్లూరి వారివీధి, ధర్మగుండం, కేపీ స్ట్రీట్, సైదిపేట, రూరల్ గ్రామాలైన తాపేశ్వరం, ఏడిద, కేశవరం గ్రామాల వలంటీర్లు సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. రాయవరం మండలంలో వెదురుపాక, కూర్మాపురం, రాయవరం, సోమేశ్వరం, వి.సావరం, కపిలేశ్వరపురం మండలంలో అంగర నుంచి ఇద్దరు, నేలటూరు, నల్లూరు, వాకతిప్ప నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారు. రామచంద్రపురం పట్టణంలోని కొత్తూరు, ముచ్చుమిల్లి, కుమ్మరి వృత్తిదారుల ఏరియా, గంగుమళ్ల వారి వీధి, వైఎస్సార్ నగర్, రూరల్ మండలంలోని జగన్నాయకులపాలెం, వేగాయమ్మపేట, ఉండూరు, ఏరుపల్లి, వెల్ల గ్రామాల వలంటీర్లు సేవారత్నకు ఎంపికయ్యారు. కె.గంగవరం మండలం బట్లపాలిక, దంగేరు, కుడుపూరు, అద్దంపల్లి, సుందరపల్లి గ్రామాల వారు, కాజులూరు మండలంలోని గొల్లపాలెంలో ఇద్దరికి, కుయ్యేరు, మంజేరు, జగన్నాథగిరిలలో ఒక్కొక్కరికి సేవారత్న అవార్డులొచ్చాయి.

రెండు నియోజకవర్గాల్లో పురస్కార గ్రహీతలు వీరే...

మండలం	మొత్తం వలంటీర్లు	సేవావజ్ర	సేవారత్న	సేవామిత్ర
రామచంద్రపురం	652	01	10	641
కె.గంగవరం	376	02	05	369
కాజులూరు	452	02	05	424
మండపేట	492	02	05	485
రాయవరం	373	02	05	366
కపిలేశ్వరపురం	292	01	05	286
మొత్తం	2,637	10	35	2,571

ప్రజల ప్రశంసలే దీవెనలు



2019 ఆగస్టు 15 నుంచి నేటి వరకూ క్రమం తప్పకుండా 50 కుటుంబాలకు ప్రభుత్వ పథకాల అమలులో సేవలు అందిస్తున్నాను. మొదట్లో సంక్షేమ పథకాలేమీ ఎక్కువ కాలం నడవలేవంటూ చిన్నచూపు చూసేవారు. మూడున్నరేళ్లుగా ఇప్పటి వరకూ ఏ ఒక్క పథకమూ ఆపకుండా కొనసాగిస్తున్నారు. దీంతో ప్రజల ప్రసంశలు దీవెనలుగా దక్కుతున్నాయి.

– వాసంశెట్టి మంగాలక్ష్మి, సేవావజ్ర పురస్కార గ్రహీత, నేలటూరు

పెరాలసిస్ రోగికి పింఛను



ఇంటింటికీ సందర్శించేటపుడు ప్రజలు తమ బాధలను, సంతోషాలను మాతో పంచుకుంటున్నారు. అలాంటి క్రమంలో హసనబాదలో పెరాలసిస్‌తో బాధపడుతున్న వ్యక్తి బాధలు విని ఆయనతో పెరాలసిస్ పింఛను దరఖాస్తు చేయించాను. రూ.5 వేల పింఛను నెలనెలా వచ్చేది. ఏడాది క్రితం పింఛనుదారుడు మృతిచెందగా వైఎస్సార్ బీమా రాయించి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరేలా చేశాను. వలంటీర్‌గా ఉన్నందువల్లనే ఆ సేవ చేయగలిగాననిపించింది.

– తీపర్తి వెంకటేశ్వరరావు, సేవావజ్ర పురస్కార గ్రహీత, హసనబాద

వెటకారం చేసినా ముందుకే సాగాను



తాపేశ్వరం– 1 సచివాలయం పరిధిలో పనిచేస్తున్న నన్ను తొలి రోజుల్లో ఇదొక పెద్ద ఉద్యోగమా అంటూ వెటకారం చేసేవారు. పెద్ద పెద్ద జీతాలు తీసుకునేవారిని గౌరవంగా చూసే ఈ సమాజంలో సేవ చేసేవారికి అంతకంటే గొప్ప గౌరవం దక్కుతుందని నా అనుభవంలో తెలుసుకున్నాను. వృద్ధులు, వికలాంగులు చిరునవ్వుతో మమ్మల్ని పలకరిస్తున్నపుడు అదే అతి గొప్ప జీతమనుకుంటూ ముందుకు సాగుతున్నాను. నా సర్వీసులో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర మూడు అవార్డులూ పొందాను.

– బూరా వెంకటేష్, సేవా వజ్ర పురస్కార గ్రహీత, తాపేశ్వరం

అగ్నిప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధం

రూ.రెండు లక్షల ఆస్తి నష్టం

మండపేట: మండలంలోని ఏడిద గ్రామంలో గురువారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు పోర్షన్ల పెంకుటిల్లు దగ్ధం కావడంతో రూ. రెండు లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎవరికి ఏమీ కాలేదు. గ్రామానికి చెందిన చంద్రమళ్ల చిన వీరయ్య, ఆయన ఇద్దరు కుమారులు జీవనోపాధి నిమిత్తం ఇంటికి తాళం వేసుకుని తమ తమ కుటుంబాలతో వేరే ప్రాంతాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. పనుల్లేని సమయంలో తిరిగి ఇంటికి వస్తుంటారు. కాగా గురువారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఆ ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి ఫైర్ స్టేషన్‌కు, చినవీరయ్య కుమారులకు సమాచారం అందించి ఈ లోగా మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మండపేట ఫైర్ ఇంజిన్ గుమ్మిలేరులో ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ పనుల వద్ద ఉండగా అనపర్తి ఫైర్ ఇంజిన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈలోగా ఇంటిలోని టీవీ, మంచాలు, ఇతర గృహోపకరణాలు, బీరువాలో దాచుకున్న సుమారు రూ. 20,000 నగదు తదితర మొత్తం కాలిబూడిదయ్యాయి. కష్టపడి కూడబెట్టుకున్నదంతా అగ్నికి ఆహుతయ్యాయని చినవీరయ్య కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో రూ. రెండు లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు అనపర్తి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



బాధితులకు ప్రభుత్వ సాయం అందజేస్తున్న వైస్ ఎంపీపీ నాగబాబు, సుధాకర్ తదితరులు

నిత్యావసర వస్తువుల పంపిణీ

సమాచారం తెలియగానే ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్ తదితరులు విషయాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన వెంటనే స్పందించి ప్రభుత్వ పరంగా అందించాల్సిన సాయం పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా తక్షణ సాయంగా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను వైస్ ఎంపీపీ నాగబాబు, ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్, రెవెన్యూ అధికారులు శుక్రవారం బాధితులకు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ తోట హామీ ఇచ్చారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఆర్ఐ గౌరి, వార్డు సభ్యురాలు చాపల లలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మండపేట 13వ వార్డులో గడప గడపకూ..



మండపేట పాటి మీద వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు తదితరులతో కలిసి ఆయన పట్టణంలోని 13వ వార్డు పాటిమీద పర్యటించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు ఆధ్వర్యంలో శెట్టిబలిజపేటలో స్థానికులు పూల వర్షం కురిపిస్తూ ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం పలికారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమై నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాల వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌తో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా సీఎం జగన్ ప్రజల వద్దకే పథకాలను చేరవేస్తూ పారదర్శక పాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. సీఎం జగన్ వచ్చాక ఎటువంటి అవినీతికి తావు లేకుండా వలంటీర్లు తలుపు తట్టి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకులు యాండ్ర బుజ్జి, పంపన శ్రీనివాస్, పెంకే గంగాధర్, శీలం సత్యనారాయణ, టేకిముడి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

రామచంద్రపురం: ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు మండలంలోని వెంకటాయపాలెంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా చైర్మన్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర సమితి ఇచ్చిన మూడో విడత ఉద్యమ కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల ఆవేదన చెబుదాం అనే కార్యక్రమంలో భాగంగా వినతి పత్రం అందించామన్నారు. గత రెండు నెలలుగా ప్రభుత్వ ఉద్యోగులు శాంతియుత వాతావరణంలో ఉద్యమం చేపట్టిన ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చిరంజీవి, మాట్లాడుతూ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణను బలోపేతం చేస్తామని తెలిపారు. జేఏసీ కార్యదర్శి ఐ.కొండయ్య, ఆర్టీసీ నాయకులు పి.సత్తిబాబు, వీఎల్ నారాయణ, చిక్కం రాజు, రామచంద్రపురం డిపో కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మజ్జిగ పంపిణీ చేసిన ఏఎల్‌సీ



కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న సహాయ కార్మిక కమిషనర్ కేశవరావు

రాయవరం: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాయవరం సహాయ కార్మిక కమిషనర్ గోదావరి కేశవరావు శుక్రవారం పలు ఇటుక బట్టీలను సందర్శించారు. రాయవరం , వెదురుపాక, వి.సావరం గ్రామాల్లోని వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు యజమానులు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీవారు. ఇటుక బట్టీలు, భవన నిర్మాణ కార్మికులకు, యజమానులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. పని ప్రదేశాల్లో యాజమాన్యాల వారు తగినంత నీరు, ఓఆర్ఎస్, మజ్జిగ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్మికులకు ఎండదెబ్బ తగలకుండా పనివేళల్లో వీలైన మార్పులు చేయాలని, వారికి ఆరోగ్య పరీక్షలు చేయించాలని వడదెబ్బకు గురైన కార్మికులను వెంటనే చల్లని ప్రదేశంలో చేర్చి దగ్గరలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను ఆయన అందజేశారు.

ముగిసిన పోలేరమ్మ తీర్థం



ఆర్యావటంలో పోలేరమ్మ ఆలయం ఎదుట దర్శనానికి బారులు తీరిన భక్తులు

కాజులూరు: మండలంలోని ఆర్యావటంలో గత మూడు రోజులుగా జరుగుతున్న గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఆర్యావటంలో సుమారు 300 ఏళ్ల క్రితం వెలసిన పోలేరమ్మని ప్రజలు గ్రామదేవతగా కొలుస్తారు. ఏటా వైశాఖమాసం అమావాస్య రోజున అమ్మవారికి తీర్థం నిర్వహిస్తుంటారు. ఇందులో బాగంగా బుధవారం రాత్రి చిన్న జాతర, గురువారం రాత్రి పెద్ద జాతర మహోత్సవాలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలతో అమ్మవారిని తెల్లవారే వరకు గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం శుక్రవారం వేకువజాము నుంచి ఆలయం వద్ద తీర్థం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తీర్థ మహోత్సవాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం కాకినాడ, కోటిపల్లి ప్రధాన రహదారిని అనుకుని ఉండటంతో ట్రాఫిక్ తలెత్తకుండా గొల్లపాలెం పోలీసులు తగిన బందోబస్తు నిర్వహించారు.

మేరీ లైఫ్–మేరా స్వచ్ఛ నగర్

15 రోజుల పాత వస్తువుల సేకరణ



మున్సిపల్ కమిషనర్ టి రామ్‌కుమార్

మండపేట: జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో మేరీ లైఫ్–మేరా స్వచ్ఛనగర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మే 20 నుంచి జూన్ 5వరకు 15 రోజుల పాటు రీ సైక్లింగ్‌కు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్ ఇతర వస్తువులను పెద్ద ఎత్తున సేకరించనున్నట్టు చెప్పారు. పాత వస్తువుల సేకరణ కోసం పట్టణంలోని అన్ని సచివాలయాల వద్ద రెడ్యూస్, రీ యూజ్, రీ సైకిల్ (ఆర్ఆర్ఆర్) సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు, సంస్థలు చైతన్యవంతులై తమ వద్ద నిరుపయోగంగా ఉన్న పుస్తకాలు, దుస్తులు, చెప్పులు, టోపీలు, దుప్పట్లు, బ్యాగులు, సైకిళ్లు, కుర్చీలు, ఎలక్ట్రికల్, ప్లాస్టిక్ వస్తువులను ఆర్ఆర్ఆర్ సెంటర్లకు అందజేయాలని కోరారు. ఆయా వస్తువులను అవసరమైన వారికి అందజేస్తామని, మిగిలిన వాటిని రీ సైక్లింగ్‌కు పంపుతామన్నారు. కార్యక్రమం విజయవంతానికి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఘనంగా గ్రామదేవతల జాతర



దంగేరులో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

కె.గంగవరం: గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర, తీర్థాన్ని, దంగేరు గ్రామదేవత కనక దుర్గమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం ఆయా గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గురువారం జాతర సందర్భంగా రెండు గ్రామాల్లోని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం ఆలయం వద్ద గారడీలు, బుట్టబొమ్మలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతర అనంతరం శుక్రవారం ఆలయం వద్ద నిర్వహించిన తీర్థానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దంగేరు సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఓవర్ లోడ్‌తో ప్రయాణిస్తే చర్యలు తప్పవు

రామచంద్రపురం రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్ (అధికంగా ప్రయాణికులను) ఎక్కిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ఆటో డ్రైవర్లను పిలిచి పలు సూచనలు చేశారు. ఇటీవల ఓవర్‌లోడ్‌తో వెళుతూ ప్రమాదాల బారిన పడి మృతి చెందిన సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లు అధికంగా ప్రయాణికులను ఎక్కించుకోకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ముఖ్యంగా వివాహాలు, ఫంక్షన్లను పురస్కరించుకుని ఆటో డ్రైవర్లు ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం చేయకూడదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు దూరం

మండపేట: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారా ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని పట్టణ సీఐ పి.శివగణేష్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై శుక్రవారం స్థానిక కొత్త బస్టాండు వద్ద ఆటో డ్రైవర్లకు సీఐ శివగణేష్, ఎస్ఐ కె. అప్పారావు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. పరిమిత వేగంతో ఆటోలను నడపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ముందు సీట్లలో ప్రయాణికులను కూర్చోబెట్టుకోకూడదని ఆటో డ్రైవర్లకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా, వాహన రికార్డులు సక్రమంగా లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ మహిళ కానిస్టేబుళ్లు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో అశ్రద్ధ వద్దు

కె.గంగవరం: ఆటోడ్రైవర్లు ప్రయాణికులను తీసుకు వెళ్తున్నప్పుడు అశ్రద్ధగా డ్రైవింగ్ చేయకూడదని ఎస్సై కె.చిరంజీవి సూచించారు. కె.గంగవరంలో ఆటో డ్రైవర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ డ్రైవర్లు నిర్వర్తించాల్సిన విధులను గుర్తు చేశారు. ఆటో డ్రైవింగ్ సీట్లో ప్రయాణికులకు కూర్చొనివ్వకూడదని, పరిమితికి మించి ప్రయాణికులను గాని, ఇతర సామగ్రినికి కాని తరలించడం చట్టపరంగా నేరమన్నారు. దీంతో మద్యం తాగి వాహనం నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి డ్రైవరు నిబంధనలను కచ్చితంగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

'పుచ్చలపల్లి'కి ఘన నివాళి



చేదువాడలో సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు, కూలీలు

కాజులూరు: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పార్లమెంట్ తొలి ప్రతిపక్షనేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి పురస్కరించుకుని మండలంలోని చేదువాడ, శీలలంక, శీల గ్రామాల్లో కార్మికులు, వ్యవసాయ కౌలురైతు సంఘం నాయకులు, కూలీలు, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చేదువాడలో వల్లు రాజబాబు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ తొలితరం నేతగా పేరు తెచ్చుకున్న సుందరయ్య పార్లమెంట్‌లో మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాడారన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు సైతం సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లిన ఆయన తన యావదాస్తి పేదలకు పంచారన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు వాసంశెట్టి సత్యనారాయణ, చందాల సూర్యనారాయణ, గంజా అప్పారావు, దంగేటి శ్రీనివాసు, పెంకే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.